
## మీ సేవ కేంద్రాల తనిఖీ



మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈడీఎం రవి బండి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5: ఆదిలాబాద్‌లోని పలు మీ సేవ కేంద్రాలను ఈడీఎం రవి బండి మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో వారి పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి సేవలు ఇవ్వాలని సూచించారు. జాబ్స్ నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో సిటిజన్ కరెక్ట్ డాక్యుమెంట్స్ అప్డేట్ చేయాలని వివరించారు. ఎటువంటి అధిక రసుము తీసుకోకుండా సరైన సర్వీస్‌లను ప్రజలకు అందజేయాలని సెంటర్ నిర్వాహకులకు ఆదేశించారు.

## రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నర్వాడే రమేశ్

ఇచ్చోడ, మార్చి 5 : మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో మంగళవారం రోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నర్వాడే రమేశ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుభాష్‌నగర్‌లో రోడ్డు గుంతల మయంగా మారిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రూ.12 లక్షలు మంజూరు చేశారన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్ రాజకీయాలకు అతీతంగా కాలనీ యువకులతో కలిసి నర్వాడే రమేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి




ఉట్నూర్: దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఉట్నూర్, మార్చి 5: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి అర్హతను బట్టి వర్తింపజేస్తామన్నారు. అలాగే అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

# అంతర్గత రోడ్లకు మహర్దశ

- రెండు మండలాలకు రూ. కోటితో సీసీ రోడ్ల నిర్మాణం
- తీరనున్న ఇబ్బందులు
- కనిపించని నాణ్యత



లోకారి(కే)లో నిర్మించిన సీసీరోడ్డు

నార్నూర్, మార్చి 5 : గ్రామాల్లోని అంతర్గత రహదారులకు మహర్దశ పట్టనుంది. గ్రామాల్లో మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అంతర్గత వీధులు అస్తవ్యస్తంగా ఉండి ఇబ్బందులు పడుతున్న పల్లెవాసులు సీసీ రోడ్లు నిర్మిస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లో ప్రభుత్వం ఉపాధి హామీ నుంచి రూ.కోటి మంజూరు చేసింది. వీటిని సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించుటకు వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకు అనేక గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఉమ్మడి మండలంలో 48 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేసేందుకు ఉపాధి హామీ నిధులు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించి పలు ప్రాంతాల్లో సీసీ రహదారులు అవసరమని గుర్తించారు. ఇందు కోసం గాదిగూడ మండలంలోని ఖడోడికి రూ.2లక్షలు, రూప్పాపూర్‌కు రూ.3లక్షలు, కొత్తపల్లి(జీ)కి రూ.3లక్షలు, గాదిగూడకు రూ.7లక్షలు, అర్జునికి రూ.2లక్షలు, రాంపూర్‌కు రూ.2లక్షలు, బొడ్డిగూడకు రూ.2లక్షలు, లోకారి(కే)కి రూ.3లక్షలు, నార్నూర్ మండలంలోని ఉమ్రికి రూ.5లక్షలు, మలేపూర్‌కు రూ.5లక్షలు, కొత్తపల్లి(హెచ్)కు రూ.14లక్షలు, మన్యాపూర్‌కు రూ.2లక్షలు, నాగల్‌కొండకు రూ.8లక్షలు, భీంపూర్‌కు రూ.5లక్షలు, తాడిహత్నూర్‌కు రూ.2లక్షలు, ఎంపల్లికి రూ. 2లక్షలు, నార్నూర్‌కు రూ.27లక్షలు, చోర్‌గావ్‌కు రూ.5లక్షలు మంజూరు చేసింది. వారం రోజుల నుంచి సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులకు పర్యవేక్షణ బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. గ్రామాల్లో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో సదరు కాంట్రాక్టర్లు సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదంటూ గ్రామవాసులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తూ సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ప్రయాణ ప్రాంగణం సందర్శన

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్



బజార్‌హత్నూర్ ప్రయాణ ప్రాంగణంలో అక్రమ నిల్వలను ఖాళీ చేయిస్తున్న ఆర్టీసీ అధికారులు

బజార్‌హత్నూర్, మార్చి 5: మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలోని అక్రమ నిల్వలను ఖాళీ చేయించారు. 'నమస్తే తెలంగాణ'లో ప్రయాణ ప్రాంగణం..ప్రైవేట్ అడ్డా' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ అధికారులు స్పందించారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్ స్టేషన్‌ను సందర్శించారు. ప్రాంగణంలో ఉన్న ప్రైవేట్ వ్యక్తులు నిల్వ ఉంచిన ఇసుక, ఇటుక, సంచార జాతుల వారితో మాట్లాడి ఖాళీ చేయించారు. ప్రయాణికులకు అనుగుణంగా ఉండే విధంగా ప్రయాణ ప్రాంగణంలో బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్తిని కాపాడుకోవాలని సూచించారు. ఇక్కడ ఆర్టీసీ అధికారి రామకృష్ణ, గ్రామస్తులు పాండు, విఠల్, చట్ల సుకుమార్ ఉన్నారు.

# ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



డిజిటల్ తరగతులు ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి, మార్చి 5: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మంగళవారం పొన్నారి గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ మొదటి వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల బోధన సౌకర్యార్థం డిజిటల్ విద్య కోసం ఎల్ఈడీ స్క్రీన్ ప్రారంభించారు. పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. యువకుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రంథాలయాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాఠశాలకు అదనపు గదులతో పాటు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాజు, ఎంపీపీలు మంజులాశ్రీధర్ రెడ్డి, తుల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రేఖ-రఘు, మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, బీఆర్ఎస్ నాయకులు సంజీవ రెడ్డి, కీర్తి అరుణ్‌కుమార్, సిరిగిరి దేవేందర్ చంద్రయ్య, కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు రాజశంకర్, వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తునికాకు యూనిట్లకు టెండర్లు పిలవాలి

ఎదులాపురం, మార్చి 5 : రాష్ట్ర వ్యాప్తంగా తునికాకు యూనిట్లకు టెండర్లు పిలవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మంగళవారం ఆదిలాబాద్‌లో అటవీ శాఖ సూపరింటెండెంట్ సరోజను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రజలకు వ్యవసాయం తర్వాత తునికాకు రెండవ పంటగా ఉపాధిగా ఉందన్నారు. ప్రతి ఏటా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఫిబ్రవరి చివరి వారం కొమ్మకొట్టుడు పనులను ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల కుటుంబాలకు ఆదాయవనరుగా ఉన్న తునికాకు పై సత్వరమే టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘువులు, తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న టీఏజీఎస్ సభ్యులు

## యువకుల రక్తదానం

బోథ్, మార్చి 5 : సోనాల గ్రామానికి చెందిన నవ నిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మంగళవారం రక్తదానం చేశారు. ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో రక్తనిధి కేంద్రానికి వెళ్లి సొసైటీ అధ్యక్షుడు శుద్ధోధన్, సభ్యులు పడిగెల నాగరాజు రక్తదానం చేశారు. అపదలో ఉన్న వారి కోసం రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

## నేడు కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ ధర్నా

బోథ్, మార్చి 5: ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి రూ.20 వేల కోట్లను దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోథ్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం, మార్చి 5 : పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అందించనున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్ సూచించారు. పట్టణంలోని గ్రంథాలయంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా అందించనున్న ఉచిత రెసిడెన్షియల్స్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు చెందిన వంద మంది నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసి వారికి ఐదు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి శిక్షణతో పాటు భోజన, హాస్టల్ వసతి, ఉచిత స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు.

## గ్రూపు-1 పరీక్షకు ఉచిత శిక్షణ

ఎదులాపురం, మార్చి 5: తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ అభ్యర్థులకు గ్రూపు-1 సర్వీస్ ఎగ్జామినేషన్ కొరకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణ అందిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రాథోడ్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైన డిగ్రీ పూర్తి చేసుకున్న మైనార్టీ ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోగా జిల్లా మైనార్టీ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమో, గ్రూపు-1 సర్వీసెస్ ఎగ్జామినేషన్‌కు దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ కాపీ, పాస్‌పోర్ట్‌సైజ్ 2 ఫొటోలు జతపరచాలన్నారు. ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9440332859ను సంప్రదించాలని సూచించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, మార్చి 5 : జిల్లాలోని ఎస్సీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి భగత్ సునీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా స్కాలర్‌షిప్ కోసం ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు అర్హత గల ఎస్సీ విద్యార్థులు ఈ-పాస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

జైనథ్, మార్చి 5: మండల కేంద్రంలో మంగళవారం వేర్వేరు కారణాలతో ఇద్దరు వ్యక్తులు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్‌కు చెందిన ఇప్ప సుధాకర్ (35) మద్యానికి బానిసై తన ఇంట్లో ఎవరు లేని సమయంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే జైనథ్ గ్రామానికి చెందిన కనక రాందాస్ (70) మంగళవారం మధ్యాహ్నం కాళ్ల నొప్పులు భరించలేక తన ఇంట్లో ఎవరు లేని సమయంలో దులానికి ఉరేసుకున్నాడు. మృతునికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాలను పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్ మర్చురికి తరలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

## డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ కోర్సు ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ఎన్ ఎసెన్షియల్ ఇంగ్లిష్ గ్రామర్ ఫర్ కాంపిటేషన్ ఎగ్జామ్స్ అనే 30 రోజుల సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఈ కోర్సు విద్యార్థులకు భవిష్యత్‌లో రాయబోయే అన్ని రకాల పోటీ పరీక్షలకు, ప్లేస్‌మెంట్లకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, కోర్స్ డైరెక్టర్ దయాకర్, తెలుగు అధ్యాపకులు సంతోష్‌కుమార్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ ప్రతాప్‌సింగ్, అకాడమిక్ కోఆర్డినేటర్ రఘునాథ్, ఆంగ్ల అధ్యాపకులు ఆనందం, భువనేశ్వరి, రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఉట్నూర్ రూరల్, మార్చి 5: చెరువుగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని తాటిగూడలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం నాయకుడు చంద్రయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 493 మంది విద్యార్థులు గైర్హాజరు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నిర్వహించిన సెకండియర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ కుమార్ పేర్కొన్నారు. ఈ పరీక్షకు 9,490 మంది హాజరు కావాల్సి ఉండగా 8997 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. 493 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

# సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5: ఆదిలాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటడం అభినందనీయమని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. పాట్నాలో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వనిత, అలేఖ్య, శిరీష ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించగా, అఖిల్ సైతం ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంగళవారం గోవర్ధన్ రెడ్డి వారిని శాలువాలతో సన్మానించి అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




## మౌళిక సదుపాయాలు కల్పించండి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఎదులాపురం, మార్చి 5 : జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ నగర్‌లో మౌళిక సదుపాయాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు కోరారు. కాలనీలో ప్రభుత్వ పాఠశాల, బస్తీ దవాఖాన, రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాలపై డీఈవో ప్రణీత, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్‌ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇక్కడ జిల్లా అధ్యక్షుడు ఎన్ స్వామి, జిల్లా సహాయ కార్యదర్శి ఆశన్న ఉన్నారు.

## పంట నష్టపరిహారం నిధులపై ఆడిట్



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

బోథ్, మార్చి 5 : మండల వ్యాప్తంగా 2023 మార్చి 17న కురిసిన అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు మంజూరైన పరిహారం నిధులపై మంగళవారం ఆడిట్ నిర్వహించారు. 503 మంది రైతులకు గాను 1002 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లగా రూ.1,00,28,250 పరిహారం కింద మంజూరయ్యాయి. వీటిని అప్పట్లో సంబంధిత ఖాతాల్లో జమ చేశారు. ఈ నిధులకు సంబంధించి రాష్ట్ర ఆడిట్ శాఖాధికారి రియజ్ ఉద్దీన్, సీనియర్ ఆడిటర్లు రజీమొద్దీన్, సారిక, కలీం ఆడిటింగ్ నిర్వహించారు. బోథ్‌లోని రైతు వేదిక భవనంలో సంబంధిత నిధులకు సంబంధించి పూర్తి వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెండి విశ్వామిత్ర, ఏఈవోలు వజీద్, జక్కుల సంతోష్, శ్యాం సుందర్ రెడ్డి, శ్యాం, దివ్య, కృష్ణ పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జైనథ్, మార్చి 5: సమాజంలోని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆదిలాబాద్ జిల్లా సీనియర్ జడ్జి, జిల్లా న్యాయ విజ్ఞాన సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. మంగళవారం పిప్పర్‌వాడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల హక్కుల గురించి న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లింగ వివక్షను విడనాడి మహిళా సాధికారత సాధించే విధంగా ముందడుగు వేయాలన్నారు. మహిళలు సామాజిక, రాజకీయ, ఆర్థిక, పురోభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీనియర్ జడ్జి క్షమాదేశ్‌పాండే

# మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య

ఎదులాపురం, మార్చి 5 : మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తాలూకా మున్నూరు కాపు సంఘ భవనంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నెరవేర్చాలని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి జిల్లా కేంద్రంలో బాలబాలికల హాస్టల్స్ భవనానికి 2 ఎకరాల భూమితో పాటు రూ.5 కోట్లతో నిర్మించాలన్నారు. అలాగే హైదరాబాద్‌లోని కోకాపేటలో ఆత్మగౌరవ భవన నిర్మాణాన్ని రూ.20కోట్లతో చేపట్టాలన్నారు. సమావేశంలో ఎండీఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి పటేల్, యువత విభాగం అధ్యక్షుడు బండి సంజయ్, కన్వీనర్ మహేందర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకృష్ణ, హైదరాబాద్ యూత్ అధ్యక్షుడు దేశెట్టి శివ, సభ్యులు రాజేశ్, ఆదిలాబాద్ తాలూకా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 5: వేసవిలో గ్రామాల్లోని ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్ పేర్కొన్నారు. మంగళవారం సిరికొండలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనులు చేయాలన్నారు. ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో బాల గంగాధర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ సాగర్‌బాయి, ఏవో కైలాస్, గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారి నేపాల్, పంచాయతీ రాజ్ అధికారి నర్సింగ్, ఏపీవో భీంరావ్, సీడీపీవో సౌందర్య, డీఈ ఉపేందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తీవ్ర నిరాశకు గురి చేసిన మోదీ సభ



మాట్లాడుతున్న సాధన పోరాట కమిటీ కన్వీనర్ బండి దత్తాత్రి

ఎదులాపురం, మార్చి 5 : జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి సాధన పోరాట కమిటీ కన్వీనర్ బండి దత్తాత్రి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం పరిధిలోని పలు పెండింగ్ సమస్యలు చాలా ఉన్నాయన్నారు. ఇతర జిల్లా అభివృద్ధి పనులను ఇక్కడి నుంచి ప్రారంభించడం సరికాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ సమస్యలు ప్రస్తావించనప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. కేంద్రం అధీనంలోని పలు ప్రాజెక్టులపై కనీస ప్రకటన లేకపోవడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి లేని బీజేపీకి ఓట్లతోనే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కో కన్వీనర్లు గణపతి రెడ్డి, రమేశ్, ఈశ్వర్, పోశెట్టి పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణ సేవా సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

బోథ్, మార్చి 5 : బోథ్‌లో నాయీబ్రాహ్మణ సేవా సంఘం భవన నిర్మాణానికి రూ.3 లక్షల నిధులు మంజూరైనట్లు సంఘం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి వీటిని కేటాయించినట్లు పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన ఎంపీ సోయం బాపురావ్, అందుకు సహకరించిన ఆదిలాబాద్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్‌కు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## ఆశ్రమ పాఠశాల సందర్శన

ఆదిలాబాద్ రూరల్, మార్చి 5: ఆదిలాబాద్ రూరల్ మండలం చిచ్ధరి ఖానాపూర్‌లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమోన్నత బాలికల పాఠశాలను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి మంగళవారం సందర్శించారు. విద్యార్థినులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. భయం వీడి పరీక్షలు ధైర్యంగా రాయాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలు, వంటగది, రిజిస్టర్లను పరిశీలించారు.